క్లుప్తంగా

వైస్ ఎంపీపీ కుటుంబానికి పరామర్శ

పాలకొండ రూరల్: వైస్ ఎంపీపీ వాకముడి అనిల్‌కుమార్ కుటుంబాన్ని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ బుధవారం పరామర్శించారు. ఇటీవల వైస్ ఎంపీపీ మామ, విశ్రాంత రెవెన్యూ ఉద్యోగి తాడ్డి పైడిరాజు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకుని ఆ కుటుంబాన్ని వీరు పరామర్శించారు. పట్టణంలోని కుమ్మరవీధిలో గల మృతుని ఇంటికి వెళ్లారు. పైడిరాజు పార్టీకి చేసిన సేవలు గుర్తు చేసుకున్నారు. వీరి వెంట వైస్ ఎంపీపీ, పార్టీ మండల అధ్యక్షుడు కనపాక సూర్యప్రకాష్, కౌన్సిలర్లు, పార్టీ పట్టణ అధ్యక్షుడు వెలమల మన్మధరావు, కడగల వెంకటరమణ, కిల్లారి మోహనరావు, కోడేం బాబి, తుమ్మగుంట శంకరరావు, బీసీ సెల్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నల్లి శివప్రసాద్, ఎంపీటీసీలు కోట అజేయ్‌కుమార్, మజ్జి నవీన్‌కుమార్, సర్పంచులు టి.ఉపేంద్రకుమార్, ఎస్.విజయ్‌కుమార్ తదితరులున్నారు.

ఏజెన్సీలో భారీ వర్షం



భామిని: వర్షంలో గొడుగుల సహాయంతో ప్రజల ప్రయాణం

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలో భారీ వర్షం కురుస్తుంది. దీంతో గెడ్డలు, వాగులు పొంగి పొర్లుతున్నాయి. బుధవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతుండడంతో ఖరీఫ్‌లో పండే వరికి కావాల్సిన నీరు అందుతుందని రైతులు చెబుతున్నారు. పసుపు, అల్లం వంటి పంటలకు నీరు ఎక్కువగా నిల్వ ఉండడంతో నష్టం ఏర్పడే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

రోజంతా వానే..

భామిని: మండలంలో మంగళవారం సాయంత్రం నుంచి వర్షం కురుస్తూనే ఉంది. రోజంతా వర్షం పడుతూనే ఉంది. ఈ వర్షం వరికి అనుకూలమైనా.. మిగతా పంటలకు కాదని రైతులు చెబుతున్నారు.

నిబంధనలు పాటించాలి : డీఎస్పీ



వినాయక మండపంలో నిర్వాహకులకు సూచనలిస్తున్న డీఎస్పీ

పాలకొండ రూరల్: సాంప్రదాయ పండగలు నిర్వహణ పర్యవేక్షిస్తున్న ఉత్సవ కమిటీలు నిబంధనలు పాటించాలని పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు అన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను ఎస్‌ఐ బి.శివప్రసాద్‌తో కలసి బుధవారం సందర్శించారు. ముఖ్యంగా విద్యుత్ అలంకరణలు, సౌండ్ బాక్సులు, ట్రాఫిక్ నిబంధనలు, ముందస్తు అనుమతులకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, ముందస్తు సమచారం మేరకు అవసరమైతే బందోబస్తు అందిస్తామన్నారు. నిర్వాహకులు ఉత్సవాల పూర్తి వరకూ బాధ్యత వహించాలని సూచించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన తప్పనిసరి

సాలూరు: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని అగ్నిమాపక అధికారి సుధాకరరావు అన్నారు. అగ్నిప్రమాదాల నివారణపై పట్టణంలో ఓ షాపింగ్‌మాల్ వద్ద బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, షాపింగ్ మాల్ వద్ద ఎల్క్ట్రికల్ షార్ట్ సర్క్యూట్, తదితర కారణాలతో అగ్నిప్రమాదాలు ఏవిధంగా సంభవిస్తాయి.. వాటిని ఎలా నివారించాలన్న అంశాలను ప్రయోగాత్మకంగా వివరించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖాధికారులు, సిబ్బంది సీతంనాయుడు, సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవీధికి తీరిన రోడ్డు సమస్య

సీతానగరం: మండలంలో దశాబ్దాలుగా రహదారి సౌకర్యంలేక ఇబ్బందులు పడుతున్న జోగింపేట కొత్తవీధి ప్రజల రాకపోకల సమస్య తీరనుందని జాతీయస్థాయిలో ఉత్తమ పంచాయతీ అవార్డు గ్రహీత సర్పంచ్ కె.సింహాచలం అన్నారు. ఈ మేరకు బుధవారం జోగింపేట కొత్తవీధి సీసీ రోడ్డు నిర్మాణానికి ఇంజినీరింగ్ సహాయకురాలు కె చందనాదేవి, కార్యదర్శి కిరణ్‌కుమార్‌లతో కలిసి సర్పంచ్ సింహాచలం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జోగింపేటలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు కార్యక్రమం నిర్వహించిన సమయంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారని తెలియజేశారు. ఈ సందర్భంగా కొత్తవీధికి రహదారి సౌకర్యం లేక రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో రూ.2 లక్షలు మంజూరుచేసినట్లు చెప్పారు. పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

● జై బోలో గణేష్ మహరాజ్ కీ..



వీరఘట్టం : కూరాకుల వీధిలో ప్రతిష్ఠించిన మట్టి గణపతి



వీరఘట్టం: బార్నాలవీధిలో భక్తుల పూజలందుకుంటున్న గణపతి



జియ్యమ్మవలస: వెంకటరాజపురంలో నిమజ్జనానికి తరలిస్తున్న వినాయక ప్రతిమ

వినాయక ఉత్సవాలు ఊరూ వాడ జరుగుతున్నాయి. త్రిరాత్రి, నవరాత్రి ఉత్సవాల వేళ సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. పలు ప్రాంతాల్లో నెలకొల్పిన వినాయక విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. పలు రూపాల్లో వినాయక ప్రతిమలు విశేషంగా అలరిస్తున్నాయి. మరోవైపు కొన్ని చోట్ల వినాయక విగ్రహాల అనుపోత్సవాలు కూడా ప్రారంభమయ్యాయి. వీటితో ఊరూ వాడ సందడిగా ఉన్నాయి. - సాక్షి నెట్‌వర్క్

లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయండి

● ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి



సమావేశంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఐటీడీఓ పీఓ

పాలకొండ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి అన్నారు. పాలకొండ ఎంపీడీఓ కార్యాలయంలో జియమ్మవలస, పాలకొండ మండలం, నగర పంచాయతీ పరిధిలో ప్రస్తుతం జరుగుతున్న గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో అభివృద్ధి పనుల తాజా స్థితిగతులపై బుధవారం సమీక్ష చేపట్టారు. అలాగే హౌసింగ్ నిర్మాణాలపై సచివాలయాల వారీగా ఆరా తీసారు. పనుల్లో నాణ్యత పాటించాలని, శాశ్వత ప్రాతిపదికన ఈ పనులు ప్రజలకు ప్రయోజనం కల్పించేలా అవసరమైన జాగ్రత్తలు పాటించాలన్నారు. అధికారులు క్షేత్ర స్థాయి సిబ్బందిని పర్యవేక్షిస్తూ లక్ష్యాల పూర్తికి కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ జి.ఉమామహేశ్వరి, ఏఓ డొంక త్రినాథులు, సచివాలయాల ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

విస్తృతంగా సర్వే



ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వివరాలు నమోదు చేస్తున్న వైద్య బృందాలు

పాలకొండ రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా ఇంటింట సర్వే సకాలంలో పూర్తి చేయాలని కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు అన్నారు. వైద్యాధికారిణి తేజరత్న నేతృత్వంలో పట్టణంలో వైద్య సిబ్బంది, వలంటీర్లు కలసి చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ప్రకియను ఆయన బుధవారం పర్యవేక్షించారు. ఈ క్రమంలో ప్రతి ఇంటిని సందర్శించి ఆ కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలను నమోదు చేసారు. సమస్యలతో ఇబ్బంది పడుతున్న రోగులను గుర్తించారు. త్వరలో చేపట్టనున్న ఉచిత మెగా వైద్య శిబిరాల ద్వారా బాధితులకు సేవలు అందిస్తామన్నారు.

సంస్కృతిని తెలియజేసేందుకు యువ క్లబ్‌లు



విద్యార్థులకు యువ, పర్యాటక క్లబ్బుల ఆవశ్యకతను వివరిస్తున్న వక్తలు

పాలకొండ రూరల్: భారతీయ సంస్కృతి... వారసత్వ సంపదను విద్యార్థులకు తెలియజేసేందుకు పాఠశాల నుండి కళాశాల స్థాయి వరకు యువ క్లబ్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా పర్యాటకాధికారి ఎస్.నారాయణరావు అన్నారు. పాలకొండ ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో ఈ మేరకు అవగాహనా కార్యక్రమాలు బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు, కలెక్టర్ సూచనలతో ఈ క్లబ్‌లు ఏడవ తరగతి నుండి యూనివర్సిటీ వరకు ఏర్పాటు చేస్తామన్నారు. తద్వారా పర్యాటక ప్రాంతాలు, వారసత్వ సంపద ఆవశ్యకతను తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు జయమణి, సత్యప్రభ, అధ్యాపకులు పి.రమేష్, విజయగౌరి, ఎ.సురేష్, రమ్య, లావణ్య, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యభద్రతకే జగన్న ఆరోగ్య సురక్ష

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ప్రజలకు సంపూర్ణమైన ఆరోగ్య భద్రత కల్పించడమే ప్రధాన ఉద్దేశమని తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. ఈ మేరకు బుధవారం పెదబోగిలి -1,2 సచివాలయాల్లో మేజర్ పంచాయతీ ఈఓ జె.వెంకటరావు అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం అమలు, సర్వే కార్యక్రమంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రకాల వ్యాధులతో ఇబ్బంది పడుతున్న రోగులకు ప్రభుత్వం జగనన్న సురక్ష పథకం ద్వారా వ్యాధుల నిర్ధారణ, నివారణ మందులు పంపిణీ చేసి, ప్రజలకు సంపూర్ణమైన ఆరోగ్య భద్రత కల్పించనున్నట్లు తెలిపారు. సచివాలయాల్లో నెలాఖరు వరకూ వైద్యాధికారుల పర్యవేక్షణలో వైద్యసిబ్బంది, గృహసారథులు, గ్రామవలంటీర్లు కలిసి నిర్దేశించిన కుటుంబాల ఇళ్లకు వెళ్లి సర్వే నిర్వహించి ఆరోగ్యపరమైన సమస్యలు గుర్తించి నివేదికలు తయారు చేయనున్నట్లు చెప్పారు. సర్వే ప్రక్రియ పూర్తికాగానే వైద్యాధికారులు వైద్యసేవలను అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జె.గరికయ్య, కిరణ్‌కుమార్, వీఆర్వోలు పైల కుమార్‌నాయుడు, ఎం.సింహాచలం, ఏఎన్‌ఎలు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలన



అధికారులకు సూచనలు చేస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

గుమ్మలక్ష్మీపురం: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు గురువారం గుమ్మలక్ష్మీపురం మండలంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలను సందర్శించనున్న నేపథ్యంలో బుధవారం పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ పరిశీలించారు. జీసీసీ, వీటీడీఏ, ఇంజినీరింగ్ శాఖలు ఏర్పాటు చేయనున్న స్టాల్స్‌పై సంబంధిత అధికారులకు పీఓ పలు సూచనలు చేశారు. ఈయనతో పాటు డీడీ కె.శ్రీనివాసరావు, జీసీసీ డీఎం వి.మహేంద్రకుమార్, ఏటీడబ్ల్యూఓ సురేష్‌కుమార్, ఎంఈఓ చంద్రశేఖర్, పీడబ్ల్యూ డీఈఈ సింహాచలం తదితరులున్నారు.

ఏకాగ్రతతోనే విజయం సొంతం



మొక్కలు నాటుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు

గరుగుబిల్లి: విద్యార్థులు చదువు పట్ల ఏకాగ్రత సాధిస్తే విజయాన్ని సొంతం చేసుకోవచ్చునని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. మండలంలోని ఉల్లిభద్రలో గల డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన శాఖలో యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధిని కల్పించే దిశగా ఉద్యాన కోర్సులు ఎంతో దోహదం చేస్తాయన్నారు. విద్యార్థులు నిరంతరం విద్యా నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలన్నారు. సాంకేతిక మార్పులు ఆధారంగా వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు వ్యాల్యూ ఎడిషన్ చేర్చి అదనపు ఆదాయాన్ని పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. అనంతరం కళాశాలలో ఉన్న సౌకర్యాలను విద్యార్థుల పురోగతిని అసోసియేట్ డీన్ బి.ప్రసన్నకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. పిమ్మట ఎస్టీ కమిషన్ శంకరరావును కళాశాల సిబ్బంది దుశ్శాలువతో సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష సర్వేలో భాగస్వాములను చేయాలి

సీతానగరం: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం అమలులో భాగంగా పంచాయతీ కార్యదర్శులు ఆరోగ్య సురక్ష సర్వేలో అందరినీ భాగస్వాములను చేయాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధిపనులు, ఇతర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పరిరక్షణకు జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టడంతో ముందుగా ప్రతి ఇంట్లో ప్రజల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారికి వైద్యుల పర్యవేక్షణలోనే అవసరమైన సేవలందేలా పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని సూచించారు.

పీఏసీఎస్ అధ్యక్షుడి మృతికి సంతాపం



బొబ్బిలి అప్పలనాయుడు(ఫైల్)

గరుగుబిల్లి: గరుగుబిల్లి ప్రాథమిక పరపతి సంఘం అధ్యక్షుడు బొబ్బిలి అప్పలనాయుడు(73) బుధవారం ఉదయం పెద్దూరులోని తన స్వగృహంలో మృతి చెందారు. ఈయన వీఆర్ఓగా విధులను నిర్వహించి పదవీ విరమణ చేశారు. విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పని చేశారు. వైఎస్సార్‌సీపీ గరుగుబిల్లి మండల కన్వీనర్‌గా విధులను నిర్వహించి పార్టీని బలోపేతానికి తన వంతు కృషి చేశారు. ఈయనకు భార్యతో పాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈయన మృతి చెందిన విషయం తెలుసుకున్న కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు సంతాపాన్ని తెలియజేశారు. గరుగుబిల్లి మండల అధ్యక్షుడు ఉరిటి రామారావు, తోటపల్లి దేవస్థాన చైర్మన్ మర్రాపు సత్యనారాయణ, తెర్లి ఎల్లంనాయుడుతో పాటు రావుపల్లి, గరుగుబిల్లి సర్పంచ్‌లు బి.మహేశ్వరరావు, కె.ఇందుమతి, నాయకులు పి.హేమసుందర్, డి.పాపినాయుడుతో పాటు పలువురు సంతాపం తెలిపారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పాలకొండ రూరల్: పౌష్టికాహార ఆవశ్యకతను వివరిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

పాలకొండ రూరల్: తల్లీబిడ్డకు పౌష్టికాహారం ఆరోగ్య భద్రత అని ఐసీడీఎస్ సీడీపీఓ సిమ్మాలమ్మ అన్నారు. పట్టణంలో కస్పా వీధి - 2 అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలను బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు అవసరమైన సంపూర్ణ ఆరోగ్యం, పోషక విలువలు ప్రభుత్వం సమకూరుస్తున్న పౌష్టికాహారం ద్వారా సమకూరుతాయన్నారు.



భామిని: పోషణ మాసోత్సవాల్లో మాట్లాడుతున్న ఎంపీటీసీ చంద్రశేఖర్, సర్పంచ్ ప్రభాకర్

పౌష్టిక ఆహారంపై ఆవశ్యకతను అంగన్‌వాడీలు వివరించారు. పిల్లల్లో ఎదుగుదల సక్రమంగా ఉండాలంటే పౌష్టికాహారం క్రమం తప్పకుండా అందించాలన్నారు. రక్తహీనత, శరీర బరువు, రోగ నిరోధక శక్తి పౌష్టికాహారం ద్వారా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు జి.శారద, జి.జెస్సీబాయి, మణికుమారి, మహిళా పోలీస్ శ్రీదుర్గ తదితరులున్నారు.

భామినిలో...

భామిని: వైఎస్సార్ సంపూర్ణ పోషణ్ సరుకులు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతంగా ఉండాలని జేసీఎస్ మండల కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, బాలేరు సర్పంచ్ జామి ప్రభాకర్ అన్నారు. మండలంలోని సొలికిరి కేంద్రంలో బాలేరు క్లస్టర్ స్థాయి పోషణ్ మాసోత్సవంలో భాగంగా చేపట్టిన పౌష్టికాహార ప్రదర్శనలో బుధవారం ఆయన పాల్గొన్నారు. సీడీపీఓ శాంతి భవాని మాట్లాడుతూ నెలవారీ అందించిన పోషణ సరుకులు వినియోగంపై దృష్టి సారించాలన్నారు. వైద్యాధికారిణి డాక్టర్ దీపికారాణి మాట్లాడుతూ గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎస్ఓ జ్యోతిలక్ష్మి, బీపీఓ వరలక్ష్మి, క్లస్టర్ కార్యకర్తలు, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

● డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ కిరణ్‌కుమార్

కొమరాడ: మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా వారిని ప్రోత్సహించాలని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వెలుగు సిబ్బందితో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ చేయూత మాల్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ మాల్ నిర్వహణ మహిళ సంఘ సభ్యులే చేస్తారన్నారు. పీఎంఈజీపీ దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ప్రోత్సాహం ఉంటుందని పేర్కొన్నారు. వీఓఏలు మహిళ సంఘ సభ్యులకు అవగాహన కల్పించి స్త్రీనిధి, సీఐఎఫ్, ఎఫ్‌పీజీ, ఉన్నతి తదితరలోన్లు వంద శాతం రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏపీఎం వెంకటరమణ, సీసీలు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

సర్వేతో శాశ్వత హక్కులు



చిన్న మంగళాపురంలో రీ సర్వే కార్యక్రమం ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పాలకొండ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూ సమగ్ర రీ సర్వేతో శాశ్వత భూ హక్కులను పొందవచ్చని మండలంలోని చిన్న మంగళాపురం సర్పంచ్ గోగుల కల్యాణి అన్నారు. గ్రామంలో సమగ్ర భూ సర్వే ప్రక్రియను లాంఛనంగా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు, గ్రామానికి సంబంధించిన భూ యజమానులు, రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించి రీ సర్వే చేపట్టారు. ఈ క్రమంలో ఎంపీటీసీ సభ్యులు మజ్జి నవీన్‌కుమార్ మాట్లాడుతూ తమ సచివాలయ పరిధిలో గల చిన్నమంగళాపురంలో దాదాపు 785 ఎకరాల భూమికి సంబంధించి ఫీల్డ్ ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్(ఎఫ్‌పీవోఎల్ఆర్) సిద్ధం చేసేందుకు ప్రభుత్వం ఎటువంటి రుసుము లేకుండా చర్యలు తీసుకోవంటం మంచి పరిణామమన్నారు. రైతులు, భూ యజమానులు అధికారులకు సహకరించి సకాలంలో రీ సర్వే ప్రక్రియ పూర్తికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ బంకి లక్ష్మణామూర్తి, ఏఎంసీ డైరెక్టర్ బొత్స గౌరు, వైస్ సర్పంచు బంకి సోంబాబు, వీఆర్వో రాజేశ్వరి, సర్వేయర్ నెల్లి శివ, వెల్ఫేర్ సహాయకులు బి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించండి



బాలేరు నది వద్ద జాగ్రత్తలు సూచిస్తున్న ఎస్‌ఐ అమ్మనరావు

భామిని: గణనాథుని నిమజ్జనంలో అపశృతులు కలగకుండా కమిటీ సభ్యులు, పెద్దలు ముందస్తు జాగత్తలు తీసుకోవాలని బత్తిలి ఎస్‌ఐ యతిరాజుల అమ్మనరావు సూచించారు. భామిని మండలం బాలేరు, సొలికిరి, కీసర, కోసలి గ్రామాల పరిధిలో వినాయక మండపాల నిర్వాహకులు, యువకులకు బుధవారం అవగాహన కల్పించారు. పిల్లలను, వృద్ధులను, ఈత రాని వారిని నిమజ్జనం చేసే నది, చెరువుల్లోకి తీసుకువెళ్లొద్దన్నారు. వెలుతురు ఉన్నప్పుడే నిమజ్జనోత్సవం చేయాలని సూచించారు. విద్యుత్తు వైర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

రహదారికి మరమ్మతులు



రహదారికి మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

గరుగుబిల్లి: పార్వతీపురం - శ్రీకాకుళం ప్రధాన రహదారి పరిధిలోని ఉల్లిభద్ర గ్రామ సమీపంలో తోటపల్లి ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ వద్ద రహదారి మరమ్మతులకు గురవడంతో ఆర్అండ్‌బీ అధికారులు రహదారికి మరమ్మతు పనులు చేపట్టారు. ఈ రహదారి తరచూ గోతుల మయం కావడంతో వర్షపు నీరు నిల్వ వుండడంతో రాకపోకలు చేసేందుకు వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. రహదారికి ఇరువైపులా కాలువల నిర్మించకపోవడంతో వర్షపు నీరు రహదారిపైనే నిల్వ వుంటుంది. ఈ విషయం ఆర్అండ్‌బీ అధికారులకు తెలియజేయడంతో తాత్కాలికంగా రహదారిపై ఉన్న గోతులను పూడ్చేందుకు చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా రహదారి పూర్తి స్థాయిలో నిర్మాణం చేపట్టేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు ఆర్అండ్‌బీ జేఈ ప్రమీల తెలిపారు.

ఉల్లిభద్రలో అన్న సమారాధన



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిభద్ర గ్రామంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా గణేష్ యూత్ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన బుధవారం నిర్వహించారు. గ్రామంలోని రామాలయం వీధిలో ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవాల్లో భాగంగా యువత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దళాయివలస, రావుపల్లి, గరుగుబిల్లి, పెద్దూరు, తదితర గ్రామాల్లో వినాయక చవితి సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు అధికంగా పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఘనంగా విశ్వకర్మ అనుపోత్సవం



అనుపోత్సవాన్ని నిర్వహించేందుకు ఊరేగిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: విశ్వకర్మ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన విశ్వకర్మ విగ్రహాన్ని బుధవారం విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా అనుపోత్సవాన్ని నిర్వహించారు. గత మూడు రోజుల నుంచి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాలతో అనుపోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు కె.గౌరీశంకరరావు, ఎం.కోదండ, చైతన్య, చిన్న, ఆచారి, నాగు, శ్రీను పాల్గొన్నారు.

అధికారికంగా నిర్వహించడాన్ని స్వాగతిస్తున్నాం..

గుమ్మలక్ష్మీపురం: విశ్వకర్మ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడాన్ని స్వాగతిస్తున్నట్లు విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.గౌరీశంకరరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో విశ్వబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా దృష్టి సారించాలని, ఆర్థికంగా ప్రోత్సాహం అందివ్వాలని, యువతకు శిక్షణ ఇచ్చి చిన్న పరిశ్రమలు నెలకొల్పేందుకు సహకారం అందివ్వాలని ఆయన కోరారు.